క్లుప్తంగా

ఏఎస్ఎన్ఎంలో అపార్ ఐడీ నమోదు



అపార్ ఐడీ నమోదు కేంద్రం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అపార్ ఐడీ నమోదు చేయనున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో అపార్ ఐడీ నమోదు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. శనివారం కూడా నమోదు కొనసాగుతుందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం సచివాలయ సిబ్బందితో ఈ కేంద్రాన్ని కళాశాలలో రెండు రోజుల పాటు ఏర్పాటుచేశామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఐక్యూ కోఆర్డినేటర్ కె.భద్రాచలం, అకడమిక్ కోఆర్డినేటర్ యామిని, అధ్యాపకుడు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'గాలికుంటు' నివారణకు టీకాలు



అబ్బిరాజుపాలెంలో ఆవుకు టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖరరెడ్డి

యలమంచిలి: మండలంలోని అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం గ్రామాల్లో శుక్రవారం 48 ఆవులు, 278 గేదెలకు గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా టీకాలు వేశారు. మట్లపాలెం, నారినమెరక, వడ్డిలంక గ్రామాలలో శనివారం ఈ శిబిరాలు నిర్వహిస్తామని మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పాడి రైతులంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల సంజీవని కిట్ల పంపిణీ



బాల సంజీవని కిట్లు అందుకుంటున్న బాలింతలు, గర్భిణులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని ఆగర్తిపాలెం గ్రామంలో విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ డే (వీహెచ్ఎన్డీ) కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గర్భిణులు, బాలింతలు, తల్లులకు ఆరోగ్య ఆహార పోషణ విద్య నిర్వహించినట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్ మంగ తెలిపారు. ఈ సందర్భంగా టేక్ హోమ్ రేషన్ పంపిణీలో బాల సంజీవని కిట్స్ అందించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా విద్యనభ్యసించాలి



నమూనా పత్రాలు అందిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్‌లు

పెనుగొండ: ప్రతి మహిళా విద్యనభ్యసించి కుటుంబ, సమాజాభివృద్ధికి పాటు పడాలని సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 23న నిర్వహించే పరీక్ష నమూనాపై వలంటీరు, టీచర్లకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ టి.సూర్యనారాయణమూర్తి, ఏపీఎం పుష్పలతలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పెనుగొండ: ఆచంట మండలంలో శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, ఆచంటకు చెందిన రామారావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎక్సైజు సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. అనధికారికంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పశుగ్రాసం పెంపకానికి ఆర్థిక సాయం

ఆకివీడు: పశుగ్రాస పెంపకానికి పూర్తి సబ్సిడీతో ఆర్థిక సాయం అందుతుందని పశు సంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాకీర్ హుస్సేన్ అన్నారు. ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరంలో ఆయన పాల్గొని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. రైతులు పశుగ్రాస ఉత్పత్తి చేపట్టాలని ఆయన సూచించారు. పశుగ్రాస ఉత్పత్తికి పూర్తి సబ్సిడీ అందుతుందన్నారు. 10 సెంట్ల భూమి నుంచి 50 సెంట్ల భూమి కలిగి, తెల్ల రేషన్ కార్డు, జాబ్‌కార్డు ఉన్న వ్యక్తులు పశుగ్రాస ఉత్పత్తికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలో 80 శాతం పశు గణన పూర్తయిందని చెప్పారు. మార్చి 31 నాటికి పూర్తిస్థాయిలో పశు గణన పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా 20 మంది రైతులకు బనియన్లను పంపిణీ చేశారు.

పెరగనున్న పాలకొల్లు పట్టణ విస్తీర్ణం

- 2045కి అభివృద్ధి ప్రణాళికకు కసరత్తు
- రింగ్ రోడ్డు ఏర్పాటుకు కృషి

పాలకొల్లు సెంట్రల్: ఆధ్యాత్మికంగా పంచారామక్షేత్రం, చినగోపురం, వ్యాపార పరంగా కోకోనట్, అపరాలు, క్లాత్ మర్చంట్స్, చేనేత పరిశ్రమలు, ధాన్యం, నూలు తదితర వ్యాపారాల్లో, కళా రంగంలో ఎందరో సినీ ప్రముఖులను అందించిన క్షీరపురికి వైభవం ఎంతో గొప్పది. పురపాలక సంఘంగా 1920లో ఏర్పడిన నాటికి పాలకొల్లు విస్తీర్ణం 4.68 కిలో మీటరు. ఇది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 105 ఏళ్లు పూర్తి చేసుకున్న రెండో మునిసిపాలిటీ. ఈ పట్టణాన్ని 2020కి అభివృద్ధి అంచనాలతో 2002లో ప్రణాళికను తయారు చేశారు. తాజాగా 2045 సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) రూపొందిస్తున్నారు. దీంతో పట్టణంలో 12 గ్రామాలు కలవనున్నాయి. విస్తీర్ణం 78 కిలో మీటర్లకు పెరగనుంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రింగ్ రోడ్డు నిర్మించనున్నారు. ఈ మేరకు వారం రోజుల క్రితం మునిసిపల్ కార్యాలయంలో భాగస్వాముల సమావేశం నిర్వహించారు.

పెండింగ్‌లోనే విలీన గ్రామాలు

2020-21లో పట్టణానికి సమీపంలో ఉన్న కొంతేరు, ఉల్లంపర్రు, పాలకొల్లు రూరల్, పూలపల్లి, వరిధనం, భగ్గేశ్వరం, అడవిపాలెం గ్రామాలను విలీనం చేస్తూ ప్రణాళిక సిద్ధం చేశారు. విలీనానికి పంచాయతీలన్నీ తీర్మానం చేసి లెటర్లు ఇచ్చాయి. అడవిపాలెం, కొంతేరుకు చెందిన కొందరు విలీనాన్ని అడ్డుకుంటూ కోర్టును ఆశ్రయించడంతో విలీన ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. మునిసిపల్ ఎన్నికలు కూడా వాయిదా పడ్డాయి.

2045 నాటికి ఇలా..

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఆఫ్ ఇండియా, ఏపీ రీజియన్ చాప్టర్ (ఐటీపీఐ, ఏపీఆర్సీ) బృందం తయారు చేస్తున్న అభివృద్ధి అంచనాల్లో భాగంగా పాలకొల్లు మండలం కాపవరం, చింతపర్రు, లంకలకోడేరు, వరిధనం, చందపర్రు, ఉల్లంపర్రు, పూలపల్లి, రూరల్, యలమంచిలి మండలం కొంతేరు, పోడూరు మండలం జిన్నూరు, మట్టపర్రు, పెనుమదం గ్రామాలు పాలకొల్లు పట్టణంలో కలవనున్నాయి. దీంతో 2045 నాటికి పట్టణ విస్తీర్ణం 78 కిలో మీటర్లకు పెరగనుంది. నివాస గృహాలు, అపార్ట్‌మెంట్‌లు ఒక ప్రాంతంలో, ఇండస్ట్రియల్స్ ఒక ప్రాంతంలో ఉండేలా ప్రణాళిక తయారు చేయనున్నారు. మూతపడి, తొలగించిన ఇండస్ట్రియల్స్ కొన్నిటిని లేఅవుట్లుగా మార్చనున్నారు. ప్రస్తుతం చెరువులు, ఇండస్ట్రియల్ భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు. వీటన్నింటినీ 2045 ప్రణాళికలో గృహ సముదాయ భూమిలుగా గుర్తించి, అనుమతులు ఇవ్వాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రింగ్ రోడ్డు ప్లానింగ్ ఇదేనా?

పట్టణంలో పూలపల్లి బైపాస్ రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించినా, రైల్వే గేటు సెంటర్ నిత్యం రద్దీగానే ఉంటుంది. రైల్వేగేటు వేసినప్పుడు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పట్టణంలో ఉన్న పూలపల్లి బైపాస్ రోడ్డును నర్సాపురం రోడ్డు మీదుగా దొడ్డిపట్ల రోడ్డుకు, బ్రాడీపేట బైపాస్ రోడ్డును పూలపల్లి బైపాస్ రోడ్డుకు అనుసందానం చేయాలి. బ్రాడీపేట బైపాస్ రోడ్డు నుంచి ఉల్లంపర్రు మీదుగా నాగరాజుపేట, సత్యసాయి కాలనీ, గొల్లలకోడేరు రోడ్డు మీదుగా రైల్వే ట్రాక్ దాటి పూలపల్లి బైపాస్ రోడ్డుకు కలుపుకోవాలి. రైల్వే ట్రాక్ వద్ద ఆర్వోబీ నిర్మించాలి. పూలపల్లి రోడ్డును నరసాపురం రోడ్డు నుంచి పాలకొల్లు రూరల్ పంచాయతీని కలుపుకుంటూ చిత్రావి చెరువుగట్టు, వరిదనం రోడ్డు మీదుగా దొడ్డిపట్ల రోడ్డును కలుపుతూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాల్సుంది. ఈ ప్రాంతాల్లో 60 అడుగుల రోడ్డు ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో భూమి కొనుగోలు చేయాల్సుంది.



ప్రస్తుత పట్టణం 4.68 కి.మీ వ్యూలో ఓ భాగం



విలీన గ్రామాలతో రింగ్ రోడ్డు ఏర్పడే పాలకొల్లు పట్టణ పరిధి మ్యాప్




మాస్టర్ ప్లాన్ 2045 ప్రణాళికలో భాగంగా 78 కిలో మీటర్ల పట్టణ మ్యాప్



క్షీరారామలింగేశ్వరస్వామి గాలిగోపురం

3 నెలల సమయం అవసరం



రాబోయే 20 ఏళ్లకు భవిష్యత్ ప్రణాళిక తయారు చేస్తున్నాం. దీనికి మూడు నెలల సమయం పడుతుంది. ప్రణాళిక తయారీ అనంతరం ముసాయిదా విడుదల చేస్తాం. అభ్యంతరాలు ఉంటే పరిగణలోకి తీసుకుంటాం. అనంతరం తుది మాస్టర్ ప్లాన్ నిర్ణయిస్తాం.

– వీరబ్రహ్మం, పట్టణ ప్రణాళికా విభాగం అధికారి, పాలకొల్లు

ఏపీబీ ఏజెంట్లకు ఆహ్వానం

నరసాపురం: ఆర్టీసీ కార్గో సర్వీస్‌కు సంబంధించి నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పలు ప్రాంతాల్లో బుకింగ్ పాయింట్ల ఏర్పాటుకు ఆథరైజ్డ్ పార్సిల్ బుక్కింగ్ (ఏపీబీ) ఏ.ఓంట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ స్థానిక డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. నరసాపురం పట్టణంలోని కోవెలవీధి, మిషన్ ఆసుపత్రి ఏరియా, మండలంలోని కొప్పర్రు, దిగమర్రు, చిట్టవరం, మొగల్తూరు మండలం మొగల్తూరు, పేరుపాలెం సెంటర్, కాళీపట్నం ప్రాంతాల్లో పాయింట్ల ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పార్శిల్స్ బుకింగ్స్, డోర్ డెలివరీ ద్వారా కమీషన్ రూపంలో నెలకు రూ.30 వేలు పైనే సంపాదించుకునే అవకాశం ఉందని, వివరాలకు డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

నరసాపురం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ నరసాపురం శాఖ ప్రధాన కార్యదర్శి వీఎస్ఎస్ ఆచార్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటుచేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పెన్షనర్లు ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్‌ను ట్రెజరీ కార్యాలయంలో అందించాలన్నారు. వచ్చేనెల 5న జరిగే సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని తీర్మానించారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు బి.ఆనందరాజు, ఎ.శామ్యూల్‌జాజు, ఆచంట హరినాథకృష్ణ పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

పెనుగొండ: గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఏప్రిల్ 6న నిర్వహించనున్న పరీక్షను ఏప్రిల్ 13కు వాయిదా వేసినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పెనుగొండ ప్రిన్సిపాల్ టి.ఎస్తేరు క్వీనీ శుక్రవారం తెలిపారు. 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం వరకు ప్రవేశాలకు ఏప్రిల్ 13న ఉదయం 10 గంటలకు 5వ తరగతిలో, మధ్యాహ్నం రెండు నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

నిర్వహణ లోపం.. ప్రయాణికులకు శాపం



పెనుగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి



ఫ్లైఓవర్‌పై పేరుకు పోయిన ఇసుక

పెనుగొండ: పెనుగొండ ఫ్లైఓవర్ నిర్వహణ లోపంతో తరచూ గోతుల మయంగా మారి రాకపోకలకు వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. పెనుగొండలో బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జిని తొలగించి, దాని స్థానంలో 15 ఏళ్ల క్రితం ఫ్లైఓవర్ నిర్మించారు. ఈ నిర్మాణంలో కాంక్రీటు పోత అనంతరం కెమికల్ పూతను విస్మరించారు. దీంతో తరచూ ఫ్లైఓవర్ మరమ్మతులకు గురవుతుదని టెక్నికల్ ఇంజినీర్లు తేల్చి చెప్పినా, నిధులు మంజూరు కాకపోవడంతో తూతూ మంత్రంగా మరమ్మతులు చేస్తూ రోడ్లు భవనాల శాఖ కాలం గడిపేస్తోంది. ఏడేళ్ల క్రితం చేపట్టిన పెనుగొండ మార్టేరు రహదారి విస్తరణలోనూ ఫ్లైఓవర్‌ను పట్టించుకోలేదు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా ఫ్లైఓవర్‌కు మరమ్మతులు చేసి వదిలేశారు.

పేరుకుపోతున్న మట్టిదిబ్బలు

ఫ్లైఓవర్‌పై కనీస నిర్వహణ లేకపోవడంతో ఇరువైపులా మట్టి, ఇసుక పేరుకుపోతుంది. దీంతో మోటారు సైక్లిస్టులు, సైక్లిస్టులు జారి పడి గాయాల పాలవుతున్నారు. వర్షాలు పడినపుడు నీరు కిందికి వెళ్లకుండా వంతెనపై హోల్స్ అన్నీ మట్టి, ఇసుకతో నిండిపోయి గోతులు ఏర్పడుతున్నాయి. దీంతో తరచూ ఫ్లైఓవర్ మరమ్మతులు చేయాల్సివస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిర్వహణ పనులు చేపట్టి ఫ్లైఓవర్ పాడవకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తపాలా శాఖలో ప్రమాద, ఆరోగ్య బీమా



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ హరికృష్ణ ప్రసాద్

పెనుమంట్ర: భారత ప్రభుత్వం తపాల శాఖ ద్వారా జీవిత ప్రమాద బీమా తోపాటు తక్కువ ప్రీమియంతో ఆరోగ్య బీమ సౌకర్యాన్నీ అమలు చేస్తోందని తపాల శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ కె.హరికృష్ణ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పెనుమంట్ర దాట్ల భవన్లో తపాలా శాఖ తణుకు సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.సూరి ప్రకాష్‌రావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో హరికృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏడాదికి రూ.899 ప్రీమియంతో రూ.15 లక్షలు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. 18 సంవత్సరాల నుంచి 60 ఏళ్ల వయసు వరకు ఈ ఆరోగ్య బీమా కవరేజీ ఉటుందన్నారు. 18 నుంచి 65 ఏళ్ల వయసు వరకు కుటుంబ ఆరోగ్య పాలసీలను పొందే సౌకర్యం తపాల శాఖలో ఉందని తెలిపారు. ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సదస్సులో భీమవరం డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీఏకే కుమార్, ఇండియన్ పోస్ట్ బ్యాంక్ జిల్లా మేనేజర్ కళ్యాణ్, వివిధ తపాల కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ పటిష్టానికి గ్రామ కమిటీలు



దండగర్ర గ్రామంలో సమావేశం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: పార్టీని మరింత పటిష్టం చేయడానికి గ్రామ కమిటీలు ఎంతగానో ఉపకరిస్తాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దండగర్ర గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వివిధ విభాగాలకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కమిటీలు గ్రామ స్థాయి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామ కమిటీని నియమించారు. నియోజకవర్గ సోషల్‌మీడియా ఇన్‌ఛార్జి కనుపూరి ఉదయభాస్కర్, నాయకులు సిర్రాపు శాంతకుమార్, ములగాల గంగారావు, సత్తి శివ, సత్తి దుర్గారావు, సత్తి నీడి కొండలరావు, దండే గోతియ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవి విన్సెంట్

భీమవరం: భూగోళాన్ని భూమిపై నివసిస్తున్న సకల ప్రాణుల జీవితాలను స్వర్గతుల్యం చేయడమే కవిత్వ ఆశయమని ఆంధ్ర యూనివర్శిటీ ఇంగ్లీష్ విభాగం సహాయాచార్యులు ఎన్.రవి విన్సెంట్ చెప్పారు. భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ కవితా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవ జీవితంతో పాటు సకల ప్రాణుల జీవితాలు సుఖమయం కావటానికి కవిత్వం పాటు పడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన మాట్లాడుతూ జాతీయోద్యమ పోరాట కాలంలో చిలకమర్తి, గరిమెళ్ల వంటి జాతీయ కవుల పద్యాలు సామాన్య ప్రజలను చైతన్య వంతులను చేశాయన్నారు. కేజీఆర్ఎల్ కళాశాల ఆంగ్ల విభాగాధిపతి ఇమ్మానుయేల్ మాట్లాడుతూ కవిత్వం ప్రజల జీవితాలకు అర్థం పరమార్థం బోధిస్తుందన్నారు. అనంతరం కవిత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కాకుమాని శ్రీనివాసరావు, జి.కిరణ్‌బాబు, పి.అరవిందస్వామి, జి.ఉమామహేశ్వరి, నర్సింహారావు, సీహెచ్ సత్యనారాయణ, పి.అమూల్యారావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు సైన్స్ దోహదం



సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, తదితరులు

భీమవరం: విద్యార్థుల్లోని సృజనాత్మకను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదం చేస్తుందని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం త్యాగరాజ భవనంలో సర్ సీవీ రామన్ స్కూల్ ఏర్పాటు చేసిన ×ఎడ్యు ఎక్స్ పో ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. సైన్స్ ఫెయిర్ ద్వారా కొత్త ఆలోచనలతోనే వినూత్న ఆవిష్కరణ పుట్టుకొస్తాయన్నారు. ఆర్టీసీ భీమవరం డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు మిసైల్ మెన్ ఆఫ్‌గా పేరు పొందిన ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత, చెరుకువాడ రంగసాయి, గన్నాబత్తుల శ్రీనివాస్, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలి



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోపిమూర్తి, తదితరులు

భీమవరం: యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి అన్నారు. వెంకటస్వామి 24వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి గోపిమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు సీహెచ్ పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు సీహెచ్ కుమారబాబ్జి, జి.రామకృష్ణంరాజు, కేఎస్ రామకృష్ణ ప్రసాద్, డి.ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మ మూల విరాట్ ముస్తాబు



మూల విరాట్‌కు రంగు వేస్తున్న సత్యనారాయణ

యలమంచిలి: ఉగాదిని పురస్కరించుకుని అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ ఆలయంలో మూల విరాట్‌కు దాతల సహకారంతో రంగులు వేయించారు. దేవదాయ ధర్మాదాయ శాఖలో పెయింటర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన పెనుగొండ గ్రామానికి చెందిన ఇళ్ల సత్యనారాయణ అమ్మవారి మూల విరాట్‌కు రంగులు వేసి పూర్వ కళ తీసుకొచ్చారని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాసరావులు తెలిపారు. ఈ విగ్రహానికి రంగు వేయడానికి 45 రోజులు పట్టిందని, తాను రంగులు వేసిన విగ్రహాల్లో ఇది 350వ విగ్రహమని సత్యనారాయణ తెలిపారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

పాలకొల్లు సెంట్రల్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మండలంలో లంకలకోడేరు ఏ, బీ సెంటర్లను జిల్లా నోడల్ ఆఫీసర్ కె.నాగేశ్వరరావు తనిఖీ చేశారు. శుక్రవారం ఇంగ్లీషు పరీక్ష నిర్వహించారు. పరీక్ష ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఎంఈఓ గుమ్మళ్ల వీరాస్వామి తెలిపారు. డీఓలు ఇ.శ్రీలక్ష్మి, పి.హరిబాబు, సురేష్, కె.శ్రీనివాసన్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం తనిఖీ

వీరవాసరం: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డ్వామా పీడీ డాక్టర్ సీహెచ్ అప్పారావు తెలిపారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో పాల్గొని ఆయన మాట్లాడారు. సామాజిక తనిఖీల్లో రూ.25,327 రికవరీ చేశామన్నారు. రూ.7,35,000 పనులపై విచారణ చేపడతామని తెలిపారు. ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, అధికారులు పాల్గొన్నారు.

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల వేతనాలు పెంచాలి

భీమవరం: నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో పని చేస్తున్న తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల వేతనాలను పెంచాలని ఏపీ తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.బసవరాజు, ఎస్.దేవీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్చి 31వ తేదీతో కాంట్రాక్ట్ ముగియనున్నందున కూటమి ప్రభుత్వం రానున్న టెండర్లలో రూ.18 వేలు జీతంగా నిర్ణయించాలన్నారు. చాలీచాలని వేతనాలతో గత పదేళ్లుగా పని చేస్తున్నామని పెరిగిన ధరలకు అనుగుణంగా ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల వేతనాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వ చట్టాలు, నిబంధనలు, సెలవులు, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వ స్కీంలో భాగంగా పని చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహించాలన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేసి ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

300 మందికి వైద్య పరీక్షలు

పాలకోడేరు: మంచి గాలి, ఆహారం, వ్యాయామం ఉంటే ఎటువంటి అనారోగ్యాలు దరి చేరవని భీమవరం మిత్ర మెడికేర్ హాస్పిటల్ వైద్యులు కర్రా ప్రశాంత్ అన్నారు. శుక్రవారం శృంగవృక్షం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో ఆయన వైద్య సేవలు అందించారు. సుమారు 300 మంది రోగులకు బీపీ, షుగర్, గుండె జబ్బులకు ఇసిజి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ జీవన విధానం సక్రమంగా లేకపోవడంతో అధిక శాతం మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. ఆర్థో పెడిషియన్ వైద్యులు కాకులపాటి శ్రీ వర్ధన్ మాట్లాడుతూ అధిక బరువు వలన నడవడమే కష్టంగా మారిందన్నారు. శిబిరంలో సుమారు 25 మంది వైద్యులు, సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో గ్రంధి రాజా, సోము రామకృష్ణ, ఆత్యం వాసు, కూర్మాల కాశీ, గుప్త, తదితరులు పాల్గొన్నారు.